1

# పాత నిబంధనలోని మతపరమైన కర్మ, గ్రహింపు

''నీవు బలిని కోరువాడవుకావు కోరినయెడల నేను అర్పించుదును దహనబలి నీకిష్టమైనది కాదు. విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలులు. దేవా, విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు'' (కీర్తన. 51:16, 17).

బాప్తిస్మమనే కార్యంలో పాపములను తీసివేయగల శక్తి తనకుగా లేదనే వాస్తవాన్ని ఆధారం చేసికొని, అది కేవలం ఒక మత కార్యంగా లేక కర్మకలాపంగా కొందరు భావించారు. బాప్తిస్మం యొక్క స్వభావాన్ని నిర్ణయించడానికి తలపెట్టి – ''క్రొత్త నిబంధనలోగాని పాత నిబంధనలోగాని, దేవునితో కలిగే భాంధవ్యానికి సంబంధించి కేవలం ఉద్దేశరహితమైన ఆచారంగా, కర్మకాండగా, ఉత్సవంగా చేయవలసిందిగా ఏ కార్యమైన కోరబడిందా?'' అనే ప్రశ్నను అడుగవలసియుంటుంది. ఒకని హృదయంతో సంబంధం లేకుండగనే ఏదేని ఒక కార్యాన్ని దేవుడు అంగీకరిస్తారా?

దేవునికి, విధేయతకు సంబంధించిన కార్యాలన్నీ ఒకే సూత్రాన్ని కలిగియుండవు. దేవునిచే అంగీకరింపబడాలన్నా, లేక ఆయన యొద్దనుండి దీవెనలను పొందాలన్నా, ఏమి కావలసివస్తుందో తెలపడానికి కనీసం ఐదు సూత్రాలైనా వర్తిస్తాయి:

(1) మానవ యోగ్యతకు సంబంధించిన కార్యం లేకుండానే ఒక వ్యక్తి యొక్క విశ్వాసాన్ని ఆధారం చేసికొని దీవెన అనుగ్రహింపబడవచ్చు.

(2) గుడ్డి విధేయతతో కూడిన విశ్వాసాన్ని ఆధారం చేసికొని దీవెన అనుగ్రహింపబడవచ్చు. అంటే, గ్రహింపులేని కార్యమో లేక దీవెనయందలి విశ్వాసమో.

(3) విశ్వాసాన్ని ఆధారం చేసికొనో, మరియు దీవెనను సంపాదించే కార్యాన్ని ఆధారం చేసికొనో దీవెన అనుగ్రహింపబడవచ్చు.

(4) మేలు పొందగలిగినది అందులో లేకపోయినా, విశ్వాసం + కార్యం కలిసినదాన్ని ఆధారం చేసికొని దీవెన అనుగ్రహింపబడవచ్చు. కనిపెట్టిన దీవెనకు కన్పించే ఎలాటి సంబంధం లేకపోవచ్చు, కాని దాన్ని అనుసరించడానికి కారణం – ఆ మేలు అనుగ్రహించబడుతుందని దేవునియందలి విశ్వాసమే.

(5) విశ్వాసమున్నవానికి కాక యితరులకు దీవెన లేక నెరవేర్పు అనుగ్రహింపబడవచ్చు.

ఈ ఐదింటిలో నాల్గు సూత్రాలు (గుడ్డి విధేయత అనే దాన్ని మినహాయించి) ఏదో యొక రూపంలో దీవెనయందలి విశ్వాసాన్ని ఆధారం చేసికొన్నవే; ఏదియెలాగున్నా, గ్రహింపు మరియు దేవుని ఆనందింపజేయడానికి అవసరమైన కార్యమును, దీవెన దేవుడు కోరిన దానిని బట్టి మారుతూ ఉండవచ్చు. ఇలాటి కొన్ని బైబిలు ఉదాహరణలను చూద్దాం.

### (1) మానవ అర్హతతో నిమిత్తం లేని విశ్వాసం

మానవ అర్హతతో, కార్యంతో నిమిత్తం లేకుండ విశ్వాసం మీదనే ఆధారపడి దీవెనను పొందిన ఉదాహరణగా అబ్రాహాం జీవితంలోని ఒక సంఘటన మనకు తెలుస్తుంది. ఆకాశ నక్షత్రాలవలె తన సంతతివారుంటారని దేవుడు అబ్రాహాముకు తెలిపాడు. ''అతడు యెహోవాను నమ్మెను; ఆయన అది అతనికి నీతిగా ఎంచెను'' (ఆది. 15:6). ఈ సందర్భంలో, అబ్రాహామునుండి దేవుడు ఏ కార్యాన్ని కోరలేదు, అయితే అతని విశ్వాసాన్ని ఆధారంగా చేసికొని అతని నీతిమంతునిగా ఎంచాడు.

### (౨) గుడ్డి విధేయత

2 రాజులు 13:14-19లో గుడ్డి విధేయతకు ఉదాహరణ కన్పిస్తుంది. తన కిటికీని తెరిచి తూర్పు దిశగా తన బాణాన్ని వేయమని ఎలీషా యెహోయాషుతో చెప్పాడు. యెహోయాషు అలా చేశాడు. (అప్పుడు) ఎలీషా యిలా అన్నాడు, - ''ఇది యెహోవా రక్షణ బాణము, సిరియనుల చేతిలోనుండి మిమ్మును రక్షించు బాణము; సిరియనులు నాశనమగునట్లు నీవు అఫెకులో వారిని హతము చేయుదువని చెప్పి'' (2 రాజులు 13:17) తన అంబులను తీసికొని నేలను కొట్టుమని ఆ తరువాత ఎలీషా యోహోయాషుకు చెప్పాడు. యెహోయాషు ముమ్మారు తన అంబులతో నేలను కొట్టాడు. ''అందునిమిత్తము దైవజనుడు అతనిమీద కోపగించి - నీవు అయిదు మారులైన ఆరుమారులైన కొట్టిన యెడల సిరియనులు నాశనమగువరకు నీవు వారిని హతము చేసియుందువు. అయితే ఇప్పుడు ముమ్మారు మాత్రమే సిరియనులను ఓడించెదవని చెప్పాడు'' (2 రాజులు 13:19).

దేవుని దీవెనయందున్న విశ్వాసానికి యెహోయాషు చేసింది ఉదాహరణ కాదు, గుడ్డి విధేయతకు అది ఉదాహరణ. తాను బాణం వేయడంలోగాని, నేలను కొట్టడంలోగాని ఉన్న ఉద్దేశమేదో యెహోయాషుకు ఎలీషా చెప్పియున్నట్లయితే; దేవునినుండి కలిగే దీవెనకు యెహోయాషు యొక్క క్రియ విశ్వాస సంబంధమైనదై ఉండేదే. అతడు విధేయత చూపినప్పుడు, విజయం అనుగ్రహిస్తాననే దేవుని వాగ్దానానికి నెరవేర్పుగా అదియుండేదే. తాను చెప్పబడనందున, దేవునికి విధేయుడవ్వడంవలన తాను పొందనున్న దీవెనను అతడు ఎరుగకున్నాడు. తన చర్యలకు ప్రతిఫలం పొందుతాననే విశ్వాసం అతనికి అందువలన లేకుండాపోయింది. అతని చర్యలు గుడ్డి విశ్వాసానికి ఫలితంగా జరిగినవే!

### (౩) సాధించడానికిగాను విశ్వాసం, కార్యం

మేలు పొందడానికిగాను జనులను పని చేయుటకు నడిపించిన విశ్వాసానికి ఉదాహరణ నోవాహు యొక్క ఓడ నిర్మాణం. రాబోయే జలప్రళయంనుండి తన కుటుంబాన్ని రక్షించుకొనడానికి ఓడ నిర్మించుకొనడానికి మధ్యగల సంబంధాన్ని నోవాహు గ్రహించగలిగాడు, అయితే దేవుడు తనకు ఆ సంగతి బయలుపరచకుంటే - జలప్రళయంనుండి తన యింటివారిని రక్షించుకొనడానికి ఓడ నిర్మాణపు అవసరాన్ని అతడు ఎరుగకయుండేవాడే. జలప్రళయం వస్తుందనే దేవుని మాటల మీద అతనికి విశ్వాసముండాలి, తక్కిన ప్రాణులనేకాలతోపాటు తనను, తన కుటుంబాన్ని కొనిపోగల ఓడను కట్టుకొనడానికి అది అతనిని నడిపించియుండాలి. అతని

విశ్వాసం క్రియకు అతనిని నడిపించి, ఆ లాభాన్ని సాధించింది, దేవుడు ఓడను నిర్మించలేదు సరిగదా ఆయన దాన్ని క్షేమకరమైన చోటికి కొనిపోలేదు. ఓడ నిర్మించుకొనడం నోవాహు యొక్క పనియే, జలప్రళయపు నీరు ఆ ఓడను తేలజేసింది.

## (4) సాధించలేని విశ్వాసం, కార్యం

దీవెనను పొందే విశ్వాసంగల వ్యక్తికి దేవునియందు విశ్వాసమున్నా, తన కార్యాలకు పొందబోయే దీవెనలకు తార్కికమైన ఏ బాంధవ్యం లేనట్టు అతడు గుర్తిస్తాడు. ఇశ్రాయేలీయులు యెరికో గోడలచుట్టు తిరిగినది దీనికి మంచి ఉదాహరణగా ఉంది. గోడలు కూల్చబడతాయనే విశ్వాసం వారికి దేవునియందు ఉండడం మాత్రమేకాదు; తాము ప్రదక్షణ చేయడానికిని, రాబోయే ఫలితాలకును ఏలాటి సంబంధాన్ని వారు చూడకుండగనే విశ్వాసపు క్రియగా వారు దానిచుట్టు తిరగాలి.

ఈలాటి సంఘటనలలో, తన కార్యాలు ఆ దీవెనలను సాధించలేవన్న విషయం విశ్వాసికి తెలిసియుంటుంది; గనుక, దేవుడు తనకేదైతే వాగ్దానం చేశారో దాన్ని తనకొరకు సాధించు కొనడానికిగాను దేవునియందలి విశ్వాసంతో అతడు తన కార్యాన్ని జరిగిస్తాడు. విశ్వాస సంబంధమైన అలాటి కార్యాలు అవసరమైనప్పుడు, వాగ్దానం చేయబడిన దీవెనలను ఒకడు గ్రహించాలి; లేకుంటే, అతడు కేవలం గుడ్డి విశ్వాసంతోనే పని చేస్తాడు. దేవుడు దాన్ని ఎలా జరిగిస్తారో అతనికి తెలియకపోవచ్చు లేదా తాను చేయవలెనని కోరుకున్నాడో అతడు ఎందుకు చేయాలో తెలియకపోవచ్చు. అయితే ఆ వాగ్దానం నెరవేర్చబడడానికిగాను ఏమి వాగ్దానం చేయబడిందో, తానేమి చేయాలో అతడు ఎరిగియుండాలి. చేసిన వాగ్దానాన్ని పొందడానికి ఒకడు పని జరిగించనట్టయితే, ఆ కార్యం వాగ్దానానికి సంబంధం లేకుండాపోతుంది. గనుక, వాగ్దానం చేసిన వానియందలి విశ్వాసంతో క్రియ జరుగలేదన్న మాటే.

## (౫) ఇతరులకు లాభం కలిగించు విశ్వాసం

తమ సంతతివారికి కనాను దేశం అనుగ్రహింపబడుతుందని దేవుడు అబ్రాహాము, ఇస్సాకు యాకోబులకు వాగ్దానం చేశాడు (ఆది. 12:7; 26:3; 35:12). ఇతరులు ఆ దీవెన పొందనైయున్నా, ఆ వాగ్దానం దేవుడు నెరవేర్చుతాడనే విశ్వాసం వారికుంది. ''వీరందరు ఆ వాగ్దానముల ఫలము అనుభవింపక పోయినను, దూరమునుండి చూచి వందనముచేసి, తాము భూమిమీద పరదేశులమును యాత్రికులమునై యున్నామని ఒప్పుకొని, విశ్వాసముగలవారై మృతినొందిరి'' (హెబ్రీ. 11:13).

దాని లాభాలు యితరులు మాత్రమే పొందే విశ్వాసపు మాదిరులు అధికంగా హెబ్రీల్లోనే ఉన్నాయి. ''విశ్వాసమునుబట్టి ఇస్సాకు జరుగబోవు సంగతుల విషయమై యాకోబును ఏశావును ఆశీర్వదించెను. విశ్వాసమునుబట్టి యాకోబు అవసాన కాలమందు యోసేపు కుమారులలో ఒక్కొక్కని ఆశీర్వదించి తన చేతికఱ్ఱ మొదలు మీద ఆనుకొని దేవునికి నమస్కారము చేసెను. యోసేపు తనకు అవసానకాలము సమీపించినప్పుడు విశ్వాసమునుబట్టి ఇశ్రాయేలు కుమారుల నిర్గమమునుగూర్చి ప్రశంసించి తన శల్యములను గూర్చి వారికి ఆజ్ఞాపించెను'' (హెబ్రీ. 11:20-22). వారికి కలుగబోయే దీవెనలయందుగాక యితరులు పొందుబోయే దీవెనలయందు ఈ జనులు విశ్వాసముంచారు.

## విశ్వాసం యొక్క పాత నిబంధన ఉదాహరణలు

తమ విశ్వాసాన్ని బట్టి దీవించబడిన పాత నిబంధన ప్రజల యొక్క ఉదాహరణలను హెబ్రీ. 11 యిస్తుంది. పొందబోయే దీవెనల విషయం ఎలాగున్నా, ఈ క్రింది విషయాలు ఆ ఉదాహరణలలో చేర్చబడియున్నాయి: (1) దేవుని యొక్క ఆజ్ఞ లేక ప్రతిపాదన, (2) దేవుడు తెలిపిన దాని గ్రహింపు, (3) మానవుని పట్ల అదృశ్యమైన ఒక ముఖ్య భాగం, (4) మానవునిచే దేవుని వాక్యం అంగీకరించబడడం, (5) కార్యం చేయవలసివస్తే, నరునిచే సరియైన కార్యం. ఏ సందర్భంలోను గుడ్డి విధేయతగా విశ్వాసం కోరబడలేదు. అంటే, కార్యంతో జతకూడిన వాగ్దానపు గ్రహింపు లేకుండ విశ్వాసంలేని కార్యం కోరబడలేదు.

### హేబెలు

''విశ్వాసమునుబట్టి హేబెలు కయీనుకంటె శ్రేష్ఠమైన బలి దేవునికి అర్పించెను'' (హెబ్రీ. 11:4). కయీనుకంటె శ్రేష్ఠమైన బలిని హేబెలు అర్పించుటను గూర్చి అనేక ప్రశ్నలు లేచాయి.

సమస్య స్వభావమేగాని ఎలాటి బలి తెచ్చాడనేది కాదని కొందరు నమ్ముతారు. అయితే లేఖనమేమో వ్యత్యాసం బలియని చెప్తుతుంది; హేబెలు కయీను కంటే ''శ్రేష్ఠమైన బలిని'' అర్పించాడు. కయీను అర్పించిన అర్పణను ధర్మశాస్త్రం చేయనిస్తుందని యితరులన్నారు (లేవీ. 2:1-16). ఇది నిజమైయుండవచ్చు, కాని ధర్మశాస్త్రం యివ్వబడక మునుపు అలాటి అర్పణలు అంగీకరింపబడ్డాయా?

(కయీను అర్పణ మాత్రమే మినహాయింపు) ధర్మశాస్త్రం యివ్వబడక మునుపు జంతు బలులు మాత్రమే యివ్వబడినట్టు రికార్డులో ఉన్నాయి. నోవహు ఓడలోనుండి బయటికి వచ్చిన తరువాత, ''యెహోవాకు బలిపీఠము కట్టి, పవిత్ర పశువులన్నిటి లోను పవిత్ర పక్షులన్నిటిలోను కొన్ని తీసికొని ఆ పీఠముమీద దహనబలి అర్పించెను'' (ఆది. 8:20). అబ్రాహాము పొట్టేలును దహనబలిగా అర్పించాడు (ఆది. 22:13). ఇస్సాకు యొక్క వాజ్మూలము జంతు బలి సాధారణమైయున్నట్టు సూచిస్తోంది, ఎలాగంటే అబ్రాహాము బలి అర్పించే స్థలానికి చేరినప్పుడు – ''దహనబలికి గొర్రెపిల్ల ఏది'' అని అడిగాడు (ఆది. 22:7). బలుల నిమిత్తము జంతువులు కావాలని మోషే ఫరోతో అన్నాడు (నిర్గమ. 10:25). ఏమి అర్పింపబడ్డాయో ప్రస్తావించబడ కుండానే బలులను గూర్చి – యితర లేఖనాలు తెలుపుతున్నాయి (ఆది. 31:54; 46:1; యోబు 1:5).

ధర్మశాస్త్రం యివ్వబడకముందు కేవలం జంతు బలులు మాత్రమే అర్పించబడినట్టు రికార్డు చేయబడిన కారణాన, జంతు బలులనే దేవుడు ఆజ్ఞాపించినట్టు సూచింపబడుతోంది. బయలుపరచబడిన దేవుని చిత్తమందలి విశ్వాసంతో (రోమా 10:17ను గమనించు), దేవుడు కోరిన బలిని హేబెలు అర్పించాడు, కయీనైతే తాను కోరుకున్న అర్పణను, దేవునికి విధేయత చూపని అర్పణను అర్పించాడు.

హేబెలు తన బలిని విశ్వాసంతో అర్పించినందువలన, అతని అర్పణ గుడ్డి విధేయతతో జరిగిన కార్యం కాదు. అది దేవుని ఆరాధించడానికి ఉద్దేశించి జరిగించియుండవచ్చు లేదా, అది దహన బలిగా అర్పించబడియుండవచ్చు.

## నోవహు

నోవహు విశ్వాసపు కార్యానికి ఉదాహరణగా ఉన్నాడు, గుడ్డి విధేయతకు కాదు. ఎందుకంటే, అతడు దేవునిచే హెచ్చరింపబడ్డాడు, తాను ఓడ ఎందుకు నిర్మిస్తున్నాడో అతనికి తెలుసు (ఆది. 6:13–22). రాబోయే జలప్రళయాన్ని గూర్చిన్నీ, ఓడ నిర్మాణం ద్వారా తన కుటుంబం భద్రపరచబడడాన్ని గూర్చిన్నీ తెలిపినప్పుడు అతడు దేవునియందు విశ్వాసముంచాడు. ఓ ఉద్దేశం కొరకు అతడు ఓడను నిర్మించాడు: తనను, తన కుటుంబాన్ని, దానిలో ప్రవేశించే మరి ఎవరినైనా, మరియు జంతు జాలాన్ని రక్షించడానికి. దేవుడు నిర్మించమని చెప్పినందున అతడు దాన్ని నిర్మించియు, జలప్రళయానికి సిద్ధపడి అందులో నివసించేలా దాన్ని కట్టకపోయినట్లయితే, తప్పు ఉద్దేశంతో అతడు ఆ పని జరిగిస్తున్నట్లు దేవుడు ఎరిగియుండేవాడే, నిస్సందేహంగా ఆయన అతని చర్యను అంగీకరించకపోయి ఉండేవాడే.

## అబ్రాహాం

గుడ్డి విధేయతను బట్టికాక, విశ్వాసాన్ని బట్టియే కార్యం జరిగించినవారికి అబ్రాహాం మరియొక ఉదాహరణగా ఉన్నాడు. అతని గమ్యం అతనికి తెలియకపోయినా, దేవుడే తనకు మార్గాన్ని తెలుపనున్నందున (ఆది. 12:1–4), ఎక్కడికి వెళ్లాలని దేవుడు తెలియజేశాడో, అక్కడికి వెళ్లితే దేవుడతనిని గొప్ప జనముగా చేస్తానన్న వాగ్దానాన్ని నెరవేర్చుతారని అతనికి విశ్వాసముంది. దేవుడు వాగ్దానం చేసిన దానిని అతడు గ్రహించి విశ్వసించాడు. తాను బయలువెడలితే తాను ఏమి చేయనైయున్నాడో దేవుడతనికి తెలియజేయనట్లయితే, లేక కేవలం బయలుదేరుమని మాత్రమే ఆయన చెప్పియుంటే, అతని కార్యం గుడ్డి విధేయతయై ఉండేదే. అయితే అతడు గ్రహించిన కారణాన, దేవుని వాగ్దానమందలి విశ్వాసంద్వారా కార్యం జరిగించాడు.

ఒకవేళ అబ్రాహాము ధనవంతుడో, లేక శక్తిమంతుడో అయ్యుండగోరి, తమ బంధు జనులకు దూరంగా ఉండగోరి, సాహసాన్ని రుచింపగోరి, లేక ఏ యితర కారణాన్నిబట్టియైనా అతడు బయలుదేరి ఉన్నట్టయితే, అతడు తప్పు కారణాన్నిబట్టి అలా చేసినవాడై ఉండేవాడే. దేవుడతని కార్యానికి బహుమానం యివ్వకుండా పోయేవాడే. ఎందుకంటే, దేవుడు హృదయాన్ని చూస్తాడు గనుక, అబ్రాహాం తప్పు ఉద్దేశంతోను, తన వాగ్దానాన్ని నెరవేర్చుతాడనే విశ్వాసం లేకుండా బయలుదేరాడు గనుక.

## యెహోషువ మరియు ఇశ్రాయేలీయులు

''విశ్వాసమునుబట్టి యేడు దినములవరకు ప్రదక్షిణము చేయబడిన తరువాత యెరికో గోడలు కూలెను'' (హెబ్రీ. 11:30). ఇశ్రాయేలీయులు గుడ్డి విధేయతతో పని చేయలేదు, కాని వాటి చుట్టు తిరిగితే గోడలు కూలిపోతాయని వారు ఎరిగి దేవుని వాగ్దానాన్ని నమ్మారు (యెహోషువ 6:1–5). ప్రదక్షిణం చేయుడని చెప్పి, తానేమి చేయనైయున్నడో దేవుడు ఆ సంగతి చెప్పకయున్నట్టయితే, గోడలను కూల్చివేస్తాడనే దేవునియందలి విశ్వాసంవలనగాక, గుడ్డి విధేయతయందు తమ కార్యం ఆధారపడియుండేదే.

దీవెన పొందే కార్యానికిని, దీవెనను సాధించే కార్యనికినిగల తారతమ్యాన్ని ఈ ఉదాహరణ చూపుతుంది. పడగొట్టే ఆయుధాలను పట్టుకొని ఇశ్రాయేలీయులు గోడలను కూలగొట్టి

యున్నట్లయితే, అది దీవెనను సాధించే కార్యమైయుండేదే. కాని, వారు విశ్వాసంతో పని చేశారు – వారు చేసే పనికిని కోరిన ఫలితానికిని ఎలాటి సంబంధాన్ని వారు చూడలేదు. దేవుడే గోడలను కూల్చుతాడని వారు నమ్మికయుంచి, దీవెనను పొందడానికి వారు ఆ గోడల చుట్టు ప్రదక్షిణం చేశారు.

ప్రదక్షిణం చేయడం, కేకలు వేయడం పొట్టేళ్ల కొమ్ములను ఊదడాన్ని దేవుడు ఎందుకు కోరుకున్నారో యెహోషువగాని ఇశ్రాయేలీయులుగాని గ్రహించనవసరం లేదు. అయినా, దేవుడు గోడలను కూల్చివేస్తాడనే విశ్వాసం కలిగియుండడానికిగాను ఆయన వాగ్దానాన్ని వారు గ్రహించడం అవసరం. దేవుని వాగ్దానాన్ని గ్రహించకుండ వారు పని చేసియున్నట్లయితే, లేక మరొక ఉద్దేశం కొరకు వారు ప్రదక్షిణం చేసియున్నట్లయితే, (ప్రదక్షిణాన్ని అలవరచుకొనడానికి చేసి యున్నట్లయితే), దేవుడు గోడలను కూల్చుతాడనే విశ్వాసంతో వారు పని చేయకుండా ఉండేవారే. అందరి హృదయములను ఎరిగిన దేవుడు, తనయందలి విశ్వాసంతో వారు ప్రదక్షిణం చేయడంలేదని తెలిసికొనియుండేవాడే. వారు ప్రదక్షిణం చేసియు, వాగ్దానం చేయబడిన దానిని పొందకపోయి ఉన్నట్లయితే, వారి పని వాగ్దానానికి చెందినది కాకుండాపోయి ఉండేదే. గనుక తమ కార్యాన్నిబట్టి దేవుడు తన వాగ్దానాన్ని నెరవేర్చుతాడనే విశ్వాసం మీద వారి చర్య ఆధారపడకుండ ఉండేదే. దేవుడు అలా జరిగిస్తాడని వారికి విశ్వాసం ఉన్నందున ఆయన గోడలను కూల్చాడు గనుక, అలాటి విశ్వాసం లేకుండ వారు ప్రదక్షిణం చేసియున్నట్లయితే, దేవుడు ఆ గోడలను కూల్చియుండేవాడు కాడు.

హెబ్రీ. 11లో విశ్వాసము యొక్క యితర ఉదాహరణలు కనుగొనవచ్చు, గాని ఈ క్రింది విషయాలను చూపడానికి యివి సరిపోతాయి:

(1) దీవెననుగ్రహించడానికి తనయందు విశ్వాసముంచవలెనని దేవుడు కోరినప్పుడు, అలాటి దీవెనను పొందడానికి గుడ్డి విధేయతకంటె ఎక్కువ (మనిషినుండి) కోరబడుతుంది.

(2) దేవునియందు విశ్వాసముంచినవారు జరిగించే కార్యానికి అనుగ్రహింపబడే దీవెనకు ఉండే సంబంధాన్ని ఎల్లవేళలా గ్రహించలేరు, కాని వారు పని జరిగించినట్లయితే దేవుడు ఏమి చేస్తానని వాగ్దానం చేశారో దాన్ని గ్రహించారు.

(3) ఒకని స్వంత పనివలననే కార్యం సాధించేలా విశ్వాసం కొన్నిసార్లు కోరబడింది.

(4) దేవుడు ఏమి జరిగించబోతాడో దాన్ని పొందడానికిగాను ఫలితాన్ని దానంతట అదే సాధించే కార్యానికి బదులు కొన్నిసార్లు విశ్వాసం కోరబడింది.

(5) తన మాట నెరవేర్చబడుతుందనే ఆయన వాగ్దానాన్ని ఆధారం చేసికొని కార్యాన్ని జరిగించే ఉద్దేశం కలిగియుండునట్టి విశ్వాసాన్ని దేవుడు కోరారు.

## బలులలోని ఉద్దేశం

పాత నిబంధనలో బలిని తెచ్చినవాడు తాను తేవలసిన అర్పణ ఎట్టిదైయుండాలో దాన్ని ఎరిగియుండడం మాత్రమేగాక, తన అర్పణ యొక్క ప్రత్యేకమైన ఉద్దేశమేమైయుందో దాన్ని కూడా అతడు గ్రహించియుంటాడు.

ఇశ్రాయేలీయులు అర్పించవలసిన పలు విధాలైన అర్పణలు, వాటికి ఉద్దేశాలు ఉండేవి. కనీసం ఐదు అర్పణలు వారు అర్పించేవారు: (1) దహన బలి (లేవీ. 1); (2) నైవేద్యం (లేవీ. 2);

(3) సమాధాన బలి (లేవీ. 3); (4) పాపపరిహారార్థ బలి (లేవీ. 4); (5) అపరాధ పరిహారార్థ బలి (లేవీ. 5). ప్రత్యేకమైన సందర్భాల్లో – ప్రథమఫలాలు, శిశుప్రసూతి, వ్యాధి శుద్ధీకరణ, యాజకులను ప్రతిష్ఠించడంలాటి అర్పణలు కూడా యిందులో చేర్చబడ్డాయి. ప్రతిదీ ఒక ప్రత్యేకమైన విధంగా చేయాలి; ప్రతిదానికి ఒక నిర్దిష్టమైన ఉద్దేశం ఉండేది.

అర్పణ యొక్క ఉద్దేశం అందులో అవసరమైన భాగమైయుంటుంది. పొరపాటున పాపం చేసినవాడు ''తాను చేసిన పాపము విషయమై'' ఒక జంతువును తేవాలి (లేవీ. 4:28). ఇతర ఉద్దేశాలతో అతడు అర్పణలు తేవచ్చును, గాని పాపపరిహారార్థ బలి విషయంలో మాత్రం, తాను జరిగించిన పాపానికే అతడు బలియర్పించవలసి యుంటుంది. కేవలం దేవుడు ఆజ్ఞాపించారు గనుక బలియర్పిస్తాం అంటే చాలదు. తాను చేసిన పాపమునకే అది అర్పణయై ఉండాలి. బలియర్పించిన వాడు, సరియైన కారణంతో అర్పింపకపోయినట్లయితే, దేవునికి బలి యర్పించడంలో విధేయుడైయున్నా, సరియైన కారణం నిమిత్తం బలియర్పించనందుకు అవిధేయుడై యున్నాడు.

ఆ కార్యం ఎలాటిదో ఆ కార్యం వెనుకనున్న ఉద్దేశం, విశ్వాసం, విధేయతల్లోని భాగమై యుంది. తప్పు కార్యం చేసేవాడు లేక అసలు ఏ కార్యం చేయనివాడు ఎలా అవిధేయుడో, తప్పు ఉద్దేశంతో సరియైన కార్యం జరిగించినవాడు కూడా అట్టివాడే.

## హృదయము, (అర్పణ) బలి

బలి అర్పించడంలోని స్వభావం మరొక ముఖ్యమైన విషయం. మత సంబంధమైన కర్మగానో, ఉత్సవంగానో గాక, కేవలం విధేయతగా బలియర్పించవలసిందిగా దేవుడు ఆజ్ఞాపించారు. అర్పణలు బలులు అర్పించేవారు వాటి భావాన్ని, ఉద్దేశాన్ని గ్రహించినవారైయుండాలని దేవుడు ఎదురు చూచారు. సంగతి గ్రహించనివారు, హృదయపూర్వకంగా చేయనివారు దేవుడు కోరిన విధేయతను జరిగించలేరు.

కేవలం బలులయందు మాత్రమే దేవుడు ఆనందించువాడు కాడు. బలి అర్పించేవారు విరిగి నలిగిన హృదయంతో దాన్ని అర్పించవలసినదిగా ఎదురు చూస్తాడు:

> నీవు బలిని కోరువాడవుకావు కోరిన యెడల నేను అర్పించుదును దహనబలి నీకిష్టమైనది కాదు. విరిగిన మనస్సే దేవునికిష్టమైన బలులు దేవా, విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు (కీర్తన. 51:16, 17).

నిర్దోషమును నిష్కళంకమునగు పశువును చంపునప్పుడు, తాను చేసిన పాపం నిమిత్తం అది చంపబడుతున్నదని గ్రహించి, మృదువైన హృదయంతో ఉన్నవాడెవడైనా బాధననుభవిస్తాడు. అట్టివాడు తన మార్గాలను మార్చుకోవాలనే ఉద్దేశం కలిగియుంటాడు. కేవలం బలియర్పించాలనే ఉద్దేశంతోనే బలియర్పించడంలో దేవుడు ఆనందించేవాడు కాడని, సరియైన హృదయంతో, సదుద్దేశంతో అర్పించవలసి యుంటుందని అనేక లేఖన భాగాలు తెలియజేస్తాయి (కీర్తన. 40:6-8; 51:16, 17; యెషయా 1:10-14; 66:3; యిర్మీయా 6:19, 20; 7:22, 23; హోషేయా 6:6; ఆమోసు 5:21-24; మీకా 6:6-8).

‘‘నీవు అంతరంగములో సత్యము కోరుచున్నావు ...’’ (కీర్తన. 51:6). అంతరంగమందు సత్యము కలిగి హృదయపూర్వకమైన బలిని దేవుడు కోరుచున్నాడు (సామె. 16:2; 21:2).

## ముగింపు

కొన్ని సందర్భాల్లో దేవుడు గుడ్డి విధేయతను కోరాడు గాని, తాను వాగ్దానం చేసినవాటిని నెరవేర్చుతాననే విశ్వాసాన్ని ఆయన సాధారణంగా కోరాడు. అలాటి విశ్వాసం సరియైన కార్యాన్ని జరిగించడం మాత్రమేగాకుండ, దేవుని చిత్తాన్ని గ్రహించియుండడం, ఆయన వాగ్దానం చేసినవి జరిగిస్తాడని నమ్మికయుంచడం, సరియైన ఉద్దేశం, హృదయ స్వభావం అనేవాటిని ఆయన కోరాడు.